ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శనివారం 27 ఏప్రిల్ 2024



లాభాల బాటలో సహకార సంఘాలు 8లో..

14మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు తిరస్కరణ 8లో..



తాగునీటి ఎద్దడి తీరేదెలా?

- జిల్లా వ్యాప్తంగా రూ.1.83 కోట్ల పనులకు ఆమోదం
- 'కోడ్' నేపథ్యంలో ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ప్రత్యేక అధికారులు, గ్రామకార్యదర్శులపై ఒత్తిడి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన పనుల విషయమై అధికార యంత్రాంగం తంటాలు పడుతున్నది. ప్రతిరోజు ఉదయమే అదనపు కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పనులు ముందుకు సాగేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి పెంచుతున్నారు. అలాగే జిల్లా పంచాయతీ అధికారి సైతం మండలాల వారిగా కార్యదర్శులు, ప్రత్యేక అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పనులన్నింటినీ ప్రారంభించే విధంగా జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాలకు తాగునీటిని మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి అందిస్తున్నారు. అయితే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీళ్ల అడుగంటడంతో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. దీంతో గ్రామాల్లో అక్కడక్కడా సరిపడా తాగునీరు ప్రజలకు అందడం లేదు. ఈ క్రమంలో ఎక్కడైతే గ్రామాల్లో క్రిటికల్ గ్యాప్స్ ఉన్నాయో వాటిని గుర్తించాలని ప్రభుత్వం నెలరోజుల క్రితం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఆ మేరకు మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ అధికారులు జిల్లా వ్యాప్తంగా కోటి 83 లక్షల రూపాయల విలువైన క్రిటికల్ గ్యాప్స్ పనులను గుర్తించారు. ఇందులో ప్రధానంగా పైపులైన్ల మరమ్మతులు, చేతిపంపుల మరమ్మతులు, పాత స్కీంలకు మోటార్ల బిగింపు వంటి పనులు తాత్కాలికంగా చేయాలని నిర్ణయించారు. పనులన్నీ 30వేల నుంచి 3 లక్షల లోపు మాత్రమే ఉండడంతో నామినేషన్ ప్రాతిపదికన పనులు అప్పగించాలని నిర్ణయించారు. అయితే ఈ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇందుకు కారణం ఏదైనా కాంట్రాక్టు పనులు చేయాలంటే దానికి ముందుగా ఒప్పందాలు కుదుర్చుకుంటారు. కనీసం ప్రొసీడింగ్స్ అయినా ఉండాలి.

● అగ్రిమెంట్లు చేసుకునే పరిస్థితి లేదు..

దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలకు మార్చి 16వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో కొత్తగా చేపట్టే పనులకు అగ్రిమెంట్లు చేసుకునే పరిస్థితి లేదు. ఇది ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుంది. ఈ నేపథ్యంలో అధికారులు పనులు చేసే వారితో ఒప్పందాలు చేసుకోలేకపోతున్నారు. ఒప్పందాలు లేక అధికారుల మాట విని పనులు చేస్తే బిల్లులు రాకపోతే ఎలా అని పనులు చేసేవాళ్లు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ జూన్ 10వ తేదీ వరకు ఉన్నందున ఎలాగైనా పనులు చేసి జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక అధికారులు, గ్రామకార్యదర్శులపై ఒత్తిడి తీసుకవస్తుండడంతో వాళ్లు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం జనవరి మాసంతో ముగిసినందున ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. అటు ప్రత్యేక అధికారులు, ఇటు గ్రామ కార్యదర్శులు తాగునీటి ఎద్దడి నివారణ కోసం చేపట్టాల్సిన క్రిటికల్ గ్యాప్స్ పనులు చేయలేకపోతున్నారు. ఈ విషయంలో మాజీ సర్పంచుల సైతం ఎవరు ముందుకు రావడం లేదు. తమ హయాంలో చేసిన కొన్ని బిల్లులు రాకపోవడమే ఎందుకు కారణమని అంటున్నారు. జిల్లాలో అక్కడక్కడా మాత్రమే పనులు జరుగుతున్నాయి. 50 శాతానికి పైగా పనులు జరగడం లేదని తెలుస్తున్నది. ప్రస్తుతం జిల్లాలో తాగునీటి ఎద్దడి తీవ్రత అంతగా లేనప్పటికీ, దినదినం ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు దంచి కొడుతుండడంతో వచ్చే నెలలో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు ఇప్పటినుంచే అప్రమత్తం అవుతున్నారు. ఒప్పందాలు లేకుండా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోగా, ఈ పనులను ఎలా చేసేదని ప్రత్యేక అధికారులు గ్రామకార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

ఎన్టీపీసీని సందర్శించిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ



టీఎస్‌టీపీపీ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

జ్యోతినగర్, ఏప్రిల్ 26 : తెలంగాణ ఎన్‌పిడిసిఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి శుక్రవారం రామగుండం ఎన్టీపీసీలో పర్యటించారు. ఉదయం ఇక్కడికి వచ్చిన సీఎండీ వరుణ్‌రెడ్డికి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్‌రంజన్ పాండు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఉన్న 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును సందర్శించారు. సోలార్ ప్రాజెక్టు నిర్మాణం, సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణలో సవాళ్ల తదితర అంశాలను ఎన్టీసీ అధికారులు ఎన్‌పీడీసీఎల్ సీఎండీకి వివరించారు. తరువాత ఎన్టీపీసీకి చెందిన 1600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టిఎస్‌టిపిపి) ప్రాజెక్టులో పర్యటించారు. యూనిట్ కంట్రోల్ రూంను పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సూపర్ క్రిటికల్ టెక్నాలజీ, ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి, ఇతర విషయాలను అధికారులు సీఎండీ వరుణ్‌రెడ్డికి వివరించారు. యూనిట్ బాయిలర్, ఇతర విభాగాలను సీఎండీ పరిశీలించారు. ఎన్టీపీసీ వీజీపీ గెస్ట్‌హౌస్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి మొక్కను నాటారు. ఈ పర్యటనలో ఎన్టీపీసీ వివిధ విభాగాల జీఎంలు, ఎన్‌పిడిసిఎల్ అధికారులు తదితరులు ఉన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు వాహనం తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులకు సహకరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సుల్తానాబాద్, ఏప్రిల్ 26: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి మంత్రి శ్రీధర్‌బాబు వాహనాన్ని అధికారులు, పోలీసులు తనిఖీ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు హైదరాబాద్ నుంచి మంథని నియోజకవర్గానికి వెళుతుండగా అధికారులు వాహనం ఆపి తనిఖీ చేశారు. పోలీసులు, ఎన్నికల అధికారులకు మంత్రి సహకరించేందుకు మంత్రి వాహనం దిగి పక్కకు నిలబడ్డారు. అధికారులు తనిఖీ అనంతరం ఆయన వెళ్లిపోయారు.

మంథనిలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు

- రెడ్ అలర్ట్ - ఎండవేడిమితో అల్లాడుతున్న జనం

మంథని, ఏప్రిల్ 26: మంథనిలో రికార్డు స్థాయిలో శుక్రవారం 45.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీఎస్‌డీపీఎస్) రెడ్‌అలర్ట్‌గా ప్రకటించింది. అలాగే జిల్లాలోని సుగ్లాంపల్లిలో 44.7, కల్వచర్లలో 44.7 భోజన్నపేటలో 44.5, అకెనేపల్లిలో 44.3 ముత్తారంలో 44.3, కూనారంలో 44, ఈసాల తక్కెళ్ళపల్లిలో 44, శ్రీరాంపూర్‌లో 44, కమాన్‌పూర్‌లో 43.6, రంగపల్లిలో 43.5, ఎక్లాస్‌పూర్‌లో 43.3, రామగుండంలో 43.3, మల్యాలపల్లిలో 43.2, పాలితంలో 43.1, జూలపల్లిలో 42.3, ఎలిగేడు 42.3, ధర్మారంలో 42.1, ఓదెలలో 41.1, కనుకులలో 40.1 డిగ్రీలు నమోదయ్యాయి. దీంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జనం తీవ్రమైన ఎండవేడిమితో అల్లాడిపోయారు. విపరీతమైన ఉక్కపోత, దహానికి తోడు వేడితో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. చాలామంది బయటకు రావటానికి జంకారు. అత్యవసరమైతేనే బయటకు వచ్చి తమ పనులు చేసుకున్నారు. వేడి కారణంగా రోడ్లన్ని మధ్యాహ్నం నుంచి సాయంత్ర వరకు నిర్మానుషంగా కనిపించాయి. ఎండ వేడిమితోచిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధుల బాధపడుతున్న వారు, ప్రయాణాల్లో ఉన్నవారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూను తలపిస్తున్నాయి.

ఎన్నికల అనంతరం రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

- ఎమ్మెల్యే విజయరమణారావు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 26: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ప్రధాన వాటిని ఇప్పటికే అమలుచేస్తున్నామని, ఈ పార్లమెంట్ ఎన్నికల అనంతరం రైతులకు రుణ మాఫీ, ఇళ్ల లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా ఎమ్మెల్యే సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజుపల్లి, భూపతిపూర్ గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో బాగంగా ఆయా గ్రామాలలో ఉపాధిహామీ పథకం పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి ఎమ్మెల్యే వారితో మాట్లాడుతు ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాకా వెంకటస్వామి ఎంపీగా, కేంద్ర మంత్రిగా పెద్దపల్లి ప్రాంతానికి ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన సేవలను కొనియాడుతూ కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసి పోగానే రైతులకు రెండు లక్షల రుణ మాఫీ అమలు చేస్తామని, ఇందిరమ్మ గృహాలను కేటాయిస్తామన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే సోనియా గాంధీ ప్రకటించిన రైతులకు కనీస మద్దతు ధరను, ఉపాధిహామీ కూలీలకు నాలుగు వందలకు పెంపు, ప్రతీ పేద మహిళకు ఏడాదికి లక్ష పంపిణీ, నిరుద్యోగయువతకు 30 లక్షల ఉద్యోగాలు కల్పించడం, ప్రజలకు రూ.25 లక్షల ఆరోగ్య భీమా వర్తింపజేయడం జరుగుతుందని అన్నారు. చేతి గుర్తుపై ఓటు వేసి గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాయకులు గుజ్జేటి వెంకన్న, బల్మూరి వెంకటరమణారావు, కవ్వంపల్లి తిరుపతి, మినుపాల ప్రకాష్‌రావు, పన్నాల రాములు, చిలుక సతీష్, సాయిరి మహేందర్, కల్లేపల్లి జానీ, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐతరాజుపల్లి రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీని గద్దె దించడమే లక్ష్యం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



అభివాదం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 26: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం నియంతత్వ పోకడలతో పదేళ్ల పరిపాలించి దేశాన్ని భ్రష్టు పట్టించిందని, కార్పొరేట్ సంస్థల చేతిలో మోదీ ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందని, రాజస్థాన్ ఎన్నికల సభలో మోదీ వాడిన భాషతో దేశం అల్లకల్లోలం అవుతుందని, కాబట్టి రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం ఓటు ద్వారా చెప్పి దేశాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీపీఐ పక్షాన కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయి మద్దతిస్తున్నామన్నారు. అనంతరం శ్రీనివాస్ గొమాసే చేసిన ఆరోపణలపై చెన్నూరు శాసనసభ్యులు, మాజీ ఎంపీ గడ్డం వివేక్ విలేకరుల ప్రశ్నలకు జవాబిచ్చారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయన్నారు. కాక వెంకటస్వామి సంగరేణిని కాపాడంవల్ల ఎన్నో కుటుంబాలు సంతోషంగా గడుపుతున్నాయని వివరించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు జైపూర్ పవర్‌ప్లాంట్, ఆర్ఎఫ్‌సీఎల్ ఏర్పాటు కోసం కృషి చేయడం వల్లనే వేలాది మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు.పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల రైల్వేస్టేషన్లలో ఎన్నో ఎక్స్‌ప్రెస్ రైల్లు ఆగేందుకు కృషి చేశానన్నారు. నేను ఓడి పోయిన స్వచ్ఛంద సంస్థ ద్వారా 25 పాఠశాలలు నిర్మించానని, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో 2 వేల బోర్లు వేయించానని ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. శ్రీనివాస్ గోమాసే ఓడిన తరువాత ఇక్కడి ప్రజలకు కనీసం కనబడ్డాడా అని ప్రశ్నించారు. పదేళ్ళు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ పెద్దపల్లిలో ఎప్పుడైన పర్యటించిన దాఖలాలు లేవన్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు కావాల్సిన వనరులు మార్కెటింగ్ లేకపోవడం వల్లనే నెలకొల్పలేదన్నారు. స్థానికుడు కాదని గగ్గోలు పెడుతున్నారు. రామగుండంలో ఒక ఇళ్ళు మంచిర్యాలలో ఒక ఇళ్ళు ఉందని అవసరమైతే పెద్దపల్లిలో ఇళ్ళు కొంటానని సవాల్ విసిరారు. అనంతరం విలేకరుల అడిగిన ప్రశ్నలను జీర్ణించుకోలేని వివేక్ అనుచరులు ఒక ప్రధాన ప్రతిక ప్రతినిధిపై దురుసుగా ప్రవర్తిస్తూ కాకా కుటుంబం గురించి నీకు ఏం తెలుసని వివేక్‌ను ప్రశిస్తున్నావని బెదిరించగా పక్కనే ఉన్న స్థానిక ఎమ్మెల్యే ఆ కార్యకర్తను వారించి పక్కకు పంపించారు. ఎమ్మెల్యే విజయ రమణా రావు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు దళితుల అన్ని విధాలా న్యాయం చేసిందన్నారు. రాహుల్ ప్రధాని అయితే ఎస్సీ వర్గీకరణ బిల్లుపై నిర్ణయం దీనిపై ప్రెస్ మీట్‌కు హాజరై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ళ కేసీఆర్ పాలనలో ఏ ఒక్క దళితున్ని మంత్రిని చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో స్పీకర్, డిప్యూ సీఎమ్, హెల్త్ మినిస్టర్లను చేసిన ఘనత మాకే దక్కిందన్నారు. ఇక్కడి మాజి ఎమ్మెల్యే ఏనాడు రైతులను పట్టించు కున్న పాపాన పోలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే ఒక్క గింజ కటింగ్ లేకుండా, వెంటనే ట్రక్ షీట్లు అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్‌కు రైతులు, ప్రజలు ఓట్లేసే పరిస్థితి లేదన్నారు.

ఈ సమావేవంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, మర్రి వెంకటస్వామి, కల్వల శ్రీనివాస్, కడార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక దందాలపై ఉక్కుపాదం : సీపీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 26: చట్ట వ్యతిరేక దందాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, ఎవరిని ఉపేక్షించేది లేదని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. గంజాయి అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం రవాణా, ఇసుక అక్రమ రవాణా, నకిలీ విత్తనాలు, పేకాట దందా, కోడి పందెలు, నాటుసారా తయారీ, అక్రమ ఫైనాన్స్‌లు, అనుమతి లేని చిట్‌ఫండ్‌లు, భూ కబ్జాలు, అనుమతి లేని లే అవుట్లు తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టామన్నారు. వీటిని పూర్తి స్థాయిలో రూపు మాపేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పద్దతులు మార్చుకోని నేరస్థుల జాబితాను సిద్ధం చేశామని, త్వరలోనే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఫిబ్రవరి 14 నుంచి ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో వివిధ దందాలపై నమోదు అయిన కేసుల వివరాలను ఆయన వెల్లడించారు. 16గంజాయి కేసుల్లో 42మందిని అరెస్టు చేశామని, 13.22కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పీడీఎస్ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు దాడులు ఉధృతం చేశామని, 48చోట్ల దాడులు చేసి 70మందిపై కేసులు నమోదు చేశామని, రూ.17.94లక్షల విలువైన 969క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 24మంది అక్రమ ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. ఇవే కాకుండా రూ.2లక్షల విలువైన నాటు సారాను స్వాధీనం చేసుకుని 105మందిపై కేసులు నమోదు చేశామన్నారు. 8.34లక్షల విలువైన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని 181మందిపై కేసులు నమోదు చేశామని, పేకాటకు సంబంధించి 27కేసుల్లో 184మందిని అరెస్టు చేశామని, రూ.22.15లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమ డీజిల్ దందాను చేధించామని, రెండు ఘటనల్లో ఏడుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

ప్రధానమంత్రి కౌసల్య కేంద్ర స్కీమ్‌కు సంబంధించి ఫేక్ ఫింగర్ ప్రింట్ రాకెట్‌ను చేధించామని ఇందులో బాధ్యులైన వారిని అరెస్టు చేశామన్నారు. మంథని ముత్తారం, కవ్వంపల్లి శివారుల్లో ఇసుక డంపులను సీజ్ చేయడమే కాకుండా అక్రమ రవాణాకు సంబంధించి 87మందిపై కేసులు నమోదు చేశామని, 50ట్రాక్టర్లు, 3 జేసీబీలను సీజ్ చేశామన్నారు.

ఎన్నికల సమయంలోనే పథకాలు గుర్తుకు వస్తాయి..

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు



నాగారం గ్రామంలో కూలీలతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

కమాన్‌పూర్, ఏప్రిల్ 26 : ఓట్ల సమయం వచ్చినప్పుడే కాంగ్రెసోళ్లకు పథకాలు గుర్తుకొస్తాయని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రొంపికుంట, నాగారం గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలు పార్లమెంట్ ఎన్నికల వరకు ఆరు గ్యారెంటీ పథకాల పేరుతో ఆగం చేసినోళ్లే మళ్ల ఆగం చేసేందుకు వస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ ఆగమైపోతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచకొండ రవి, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, సంపత్‌యాదవ్, బాద్రపు మల్లేష్, భూమయ్య, రవి, చిందం తిరుపతి, తాటికొండ శంకర్, వెంకటేష్, నీలం శ్రీనివాస్, ఎద్దు రాజయ్య తదితరులు ఉన్నారు.

పశువుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టెల ఏర్పాటు

కోల్‌సిటీ, ఏప్రిల్ 26: పశువులు, పక్షుల దాహార్తి తీర్చడానికి నగరంలో వివిధ చోట్ల నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నట్లు రామగుండం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో శుక్రవారం పదకొండు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు ఎక్కువగా తిరగాడే ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. గుర్తించిన అన్ని ప్రాంతాల్లో దశల వారీగా నీటితొట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నగరపాలక సంస్థ ట్యాంకర్ల ద్వారా నీటితొట్లను నింపుతున్నప్పటికీ స్థానిక ప్రజలు కూడా భాగస్వాములై నిరంతరం నీరు ఉండేలా చూసుకుంటూ సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్ఈ చిన్నారావు, డీఈఈ జమీల్, ఏఈ తేజస్విని పాల్గొన్నారు.

రెండో దశ పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి : కలెక్టర్

పెద్దపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా, అదనపు కలెక్టర్‌లు జే.అరుణశ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్‌లాల్‌లతో కలిసి పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ధర్మారం మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల సిబ్బందిని ఇక్కడి నుండి కేటాయించడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి రెవెన్యూ జిల్లాలో మొత్తం 763 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని , వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఓపిఓ లను కేటాయించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలు ప్రకారం 20 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 290 పోలింగ్ కేంద్రాలకు 342 పోలింగ్ బృందాలను, రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 260 పోలింగ్ కేంద్రాలకు 306 పోలింగ్ బృందాలను, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 160 పోలింగ్ కేంద్రాలకు 188 పోలింగ్ బృందాలను, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ధర్మారం మండలంలో ఉన్న 53 పోలింగ్ కేంద్రాలకు 62 మంది పోలింగ్ బృందాలను పారదర్శకంగా ఎన్.ఐ.సి. సాఫ్ట్వేర్ వినియోగిస్తూ ఆన్లైన్లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు హనుమా నాయక్, బి.గంగయ్య, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్, డీఈవో మాధవి, తదితరులు పాల్గొన్నారు.





భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 26: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను తాగుడుకు బానిసై ఆమెను రోకలిబండతో కొట్టి హత్య చేసిన నేరంలో నిందితుడు భర్తకు జీవిత ఖైదుతోపాటు 2000 రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి బి ప్రతిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీముని మండలం వాడ్ల గ్రామానికి చెందిన డోకా బక్కయ్య కూతురు వసంతను మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. ఏడాదిన్నర తర్వాత బక్కయ్య ఇంటిముందు గల మహ్మద్ సాబీర్ (30) వసంతతో ఉన్న పరిచయంతో ఆమెకు మాయమాటలు చెప్పి తీసుకొని వెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ సంఘటన తర్వాత బక్కయ్య తన కుటుంబంతో సహా బతుకుదెరువు కోసం చొప్పదండి మండలం మంగళ్లపల్లికి వచ్చి జీవిస్తున్నాడు. వసంతకు కూడా ఆర్థిక ఇబ్బందులు రావడంతో కుటుంబంతో సహా తండ్రి వద్దకు వచ్చి వారితో కలిసి జీవిస్తున్నది. వసంత భర్త సాబీర్ తాగుడుకు బానిసై 2017 అక్టోబర్ 13న రాత్రి తాగివచ్చి భార్యతో గొడవపడి ఆమెను రోకలిబండతో తీవ్రంగా గాయపరచడంతో ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ సంఘటనపై బక్కయ్య చొప్పదండి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సాబీర్‌పై హత్యానేరం కేసు నమోదు చేయగా అప్పటి సీఐ లక్ష్మీబాబు కేసు దర్యాప్తు జరిపి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడు సాబీర్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 26: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో మోతె మల్లమ్మ(75) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మల్లమ్మ(75)గురువారం ఉదయం ఇంటి ముందు శుభ్రం చేస్తున్న క్రమంలో ఆమె కుడిచేయిపై గుర్తు తెలియన విష పురుగు కుట్టింది. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మల్లమ్మ మరణించింది. మల్లమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భూమి ఫోర్జరీ కేసులో ఇద్దరి అరెస్టు

వీణవంక, ఏప్రిల్ 26: మండలంలోని మల్లారెడ్డిపల్లిలో 2.26 ఎకరాల వ్యవసాయ భూమిని ఫోర్జరీ చేసి ఇతరులకు విక్రయించిన కేసులో శుక్రవారం పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన దూలం రాజయ్య తన 2.26 ఎకరాల వ్యవసాయ భూమిని అవసరం నిమిత్తం గ్రామానికి చెందిన మేకల మోహన్‌రెడ్డికి 1.13, కొలిపాక రామస్వామికి 1.13 ఎకరాలు విక్రయించారు. ఈ భూమిని వారి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. భూమి విక్రయం రాజయ్య మేనల్లుడు బొంగోని స్వామికి ఇష్టం లేక పోవడంతో అతడు రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో ఒప్పందం చేసుకుని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనికి గతంలో పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ధరణి ఆపరేటర్ అరుణ్ చౌదరి సహకరించారు. ఈ మేరకు వారికి స్వామి రెండు లక్షల రూపాయలు ముట్టజెప్పేందుకు ఒప్పందం చేసుకు న్నాడు. పథకం ప్రకారం మోహన్‌రెడ్డి, కొలిపాక రామస్వామికి రిజిస్టేషన్ ఒరిజనల్ పత్రాలు సిబ్బంది ఇవ్వలేదు. భూమి హక్కు పత్రాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వారిని వేలి ముద్రలు వేస్తేనే ఒరిజనల్ పత్రాలు వస్తాయని ధరణి ఆపరేటర్ నమ్మించాడు. వారి అతడి మాటను విశ్వసించి వేలిముద్రలు వేశారు. దీంతో వారి పేరు మీద ఉన్న భూమి బొంగోని స్వామికి విక్రయించినట్లు పత్రాలు తయారు చేసి అందజేశారు. కబ్జాల్లో మోహన్‌రెడ్డి, రామస్వామి ఉన్నప్పటికీ హక్కు పత్రాలు స్వామి పేరిట ఉన్న విషయం తెలియడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరు నిందితులు స్వామితో పాటు అరుణ్ చౌదరిని అరెస్టు చేశామని, ఈ కేసుతో సంబంధం ఉన్న మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని ఎస్సై తిరుపతి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.














డిప్లొమా కోర్సులో చేరికకు
దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: కేంద్ర జౌళి మంత్రిత్వశాఖకు సంబంధించిన ఒరిస్సా రాష్ట్రంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, బార్గా కళాశాలలో మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ హ్యాండ్లూం, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్లు చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎస్ చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై జూలై 16, 2024 నాటికి జనరల్ కేటగిరిలో 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలలో 15 నుంచి 25 సంవత్సరాలు నిండిన వారు అర్హులని, ఈ కళాశాలలో తెలంగాణ రాష్ట్రానికి తొమ్మిది సీట్లు కేటాయించారని తెలిపారు. ఔత్సాహిక విద్యార్థులు జూన్ 10, 2024లోగా వారి దరఖాస్తులను నిర్ణీత ప్రొఫార్మాలో నెల్లూరు జిల్లాలోని ప్రిన్సిపాల్, ఎస్‌పీకేఎం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వెంకటగిరి చిరునామాకుగానీ, కరీంనగర్ మంకమ్మతోటలోని సహాయ సంచాలకుడు చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో బావిలో దూకి
వివాహిత ఆత్మహత్య

తిమ్మాపూర్, ఏప్రిల్ 26: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో గల 8వ డివిజన్ అలుగు నూర్‌లో అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది శుక్రవారం ఓ వ్యవసాయ భావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన పున్నం సత్తమ్మ(51) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స కోసం ఆస్పత్రులకు వెళితే డబ్బులు ఖర్చు అవుతున్నా నయం కావడం లేదని మనస్తాపం చెందింది. శుక్రవారం తెల్లవారు జామున 5గంటలకు సత్తమ్మ వాకింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సత్తమ్మ భర్త శ్రీనివాస్, కుమారుడు హరిష్ ఆమె కోసం గాలి స్తుండగా కొద్ది దూరంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్ద సత్తమ్మ చెప్పులు గమనించారు. బావిలోకి చూడగా సత్తమ్మ మృతదేహం కనిపించింది. సత్తమ్మ అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 26: మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని వెటర్నరీ ఆసుపత్రిలోని అటెండర్ ముద్దం గంగాధర్(42) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మదం గంగాధర్ పనుల నిమిత్తం మెట్‌పల్లి పట్టణానికి వెళ్తున్న క్రమంలో వెల్లుల్ల గ్రామ శివారులోని వీఆర్‌ఎమ్ గార్డెన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఏప్రిల్ 26: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తది తర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొ క్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధా లయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. వందలాది మంది భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

శ్రీలంక అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి

- ఎల్లలు దాటిన ప్రేమ.. పెళ్లితో ఒక్కటయ్యారు..

రాయికల్/మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 26: జగిత్యాల జిల్లా రాయికల్ మండంలోని భూపతిపూర్‌లో శ్రీలంక అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి శుక్రవారం ప్రేమ పెళ్లి చేసుకుని ఒక్కటయ్యారు. శ్రీలంక దేశానికి చెందిన మరియక్రిష్టియన్ జోర్డాన్ దేశంలో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని మెట్‌పల్లి మండలం మూడు బొమ్మల మేడిపల్లికి చెందిన జోగిడె అశోక్ ఇదే కంపెనీలో పని చేస్తున్నాడు. మూడేళ్ల పాటు ఒకే కంపెనీలో పని చేయడంతో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఇరువైపు లా కుటుంబసభ్యులకు తమ ప్రేమ విషయం చెప్పారు. కుటుంబసభ్యుల అంగీకారంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల అశోక్ తన ప్రేమికురాలు మరియతో స్వగ్రామానికి చేరుకున్నారు. అశోక్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన తన సోదరి ఇంటికి వచ్చి శుక్రవారం పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. రామోజీపేట మండలంలోని భూపతిపూర్ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో కుటుంబసభ్యులు, బంధువుల మధ్య హిందూ సాంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు.



పెళ్లి చేసుకుంటున్న
శ్రీలంక అమ్మాయి-తెలంగాణ అబ్బాయి

రోడ్డు ప్రమాదంలో రిటైర్డు ఉద్యోగి మృతి

ముస్తాబాద్, ఏప్రిల్ 26 : ముస్తాబాద్ మండలం సిద్దిపేట దారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి చెందారు. ముస్తాబాద్ పట్టణానికి చెందిన అబ్రమేని సాయిలు ముస్తాబాద్ వైపు నుంచి సిద్దిపేట ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. సిద్దిపేట వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ద్విచక్రవాహనంతో పాటు సాయిలును రోడ్డు మీద నుంచి పక్కన ఉన్న గుంతవైపు కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ద్విచక్ర వాహనం, కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యాయి. సా యిలుకు తీవ్రమైన గాయాలు కావడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమం కావడంతో మరణించినట్లు వైద్యులు తెలిపారు. సాయిలుకు భార్య పరమేశ్వరి, కూతుళ్లు వెన్నెల, అర్చన ఉన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సంఘం అధ్యక్షుడు పుల్లూరి రవి, మాజీ ఎంపీటీసీ గజ్జెల రాజు, పిట్ల విఠల్, రంజాని రాజలింగం సామాజిక వర్గ సభ్యులు డిమాండ్ చేశారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.



సాయిలు(ఫైల్)

కొడుకును రోకలిబండతో బాది హత్య చేసిన తండ్రి

- రాణాలో లొంగిపోయిన నిందితుడు శ్రీనివాస్ - ఆన్‌లైన్ గేమ్స్, అప్పులే హత్యకు కారణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: ఆన్‌లైన్ గేమ్స్‌తో డబ్బులు పోగొట్టుకుని లక్షల రూపాయలు అప్పుచేస్తున్న కొడుకును తండ్రి వారించాడు. అయినా వినకుండా హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నానని చెబుతూ స్నేహితులతో జల్సాలు చేస్తూ, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ స్థాయికి మించి 15 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చేందుకు వారికి ఉన్న మూడు గుంటల భూమిని విక్రయించాలని కొడుకు తన తండ్రిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాడు. ఒక దశలో భూమిని అమ్మకుంటే చంపుతానని తండ్రిని బెదిరించాడు. దీంతో కొడుకు తనను ఎలాగైనా హత్య చేస్తాడని భయంతో కొడుకు ఇంటిలో ఉన్నప్పుడు ఇంటికి రాకుండా బయటనే గడిపాడు. తనను చంపక ముందే తనే కొడుకును చంపాలని నిర్ణయించుకుని అమలు చేశాడు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్, మృతుడి బంధువుల వివరాల ప్రకారం... కొత్తపల్లి మండలం చింతకుంటగ్రామానికి చెందిన పెరుమాండ్ల శివసాయి(21) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నానని చెబుతూ ఎలాంటి పనిచేయకుండా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ స్నేహితులతో జల్సాగా తిరుగుతూ 15 లక్షల వరకు అప్పుచేశాడు. ఈ అప్పులు తీర్చేందుకు ఉన్న మూడు గుంటల భూమిని విక్రయించాలని ఆరు నెలలుగా తండ్రి శ్రీనివాస్‌పై తీవ్రఒత్తిడి తీసుకువస్తున్నాడు. జల్సాలకు అలవాటైన కొడుకు పద్ధతి మార్చుకోవాలని ఎంత నచ్చజెప్పినా వినలేదు. భూమి విక్రయించకుంటే చంపుతానని శివసాయి తన తండ్రిని బెదిరిస్తున్నాడు. ఈక్రమంలో తనను కొడుకు చంపుతాడని అనుమానించిన శ్రీనివాస్... కొడుకు ఇంటికి వచ్చిన సమయంలో భయంతో బయటకు వెళుతున్నాడు. ఎలాగైనా కొడుకును చంపాలని నిర్ణయించుకున్న తండ్రి శ్రీనివాస్ ఐదు నెలలుగా సమయం కోసం ఎదురుచూస్తున్నాడు. శుక్రవారం ఉదయం 10గంటలకు ఇంట్లో ఎవరూలేని సమయంలో మంచంపై నిద్రిస్తున్న కొడుకు పెరుమాండ్ల శివసాయి తల, ముఖంపై రోకలిబండతో కొట్టాడు. తప్పించుకునే ప్రయత్నం చేయటంతో అప్పటికే సిద్ధం చేసుకున్న కారంపొడిని కళ్లల్లో చల్లాడు. ఆ వెంటనే రోకలిబండతో మరో నాలుగుసార్లు తలపై కొట్టగా తల పగిలి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకును చంపిన తరువాత నిందితుడు శ్రీనివాస్ డయల్ 100 కాల్ చేసి కొత్తపల్లి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మృతుడి తండ్రి శ్రీనివాస్ మున్సిపాలిటీలో కాంటాక్టు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంఘటనా స్థలాన్ని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ పరిశీలించి, విచారణ జరిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



శివసాయి(ఫైల్)

తనిఖీల్లో నగదు పట్టివేత

చందుర్తి, ఏప్రిల్ 26: ఎన్నికల నేపథ్యంలో తనిఖీల్లో భాగంగా ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.53,000 నగదును చందుర్తి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపట్టగా చందుర్తికి చెందిన సాయి వంశీని తనిఖీ చేశారు. ఈ మేరకు నగదు బయటపడినట్లు తెలిపారు. రూ. 50 వేలకు పైగానగదు తీసుకెళ్లేటప్పుడు దానికి సంబంధించిన పూర్తి ఆధారాలు దగ్గర ఉంచుకోవాలని లేనట్లయితే స్వాధీనం చేసుకుంటామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

భూ ఆక్రమణ కేసులో పోలీసు కస్టడీకి నిందితులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించినందుకు అరెస్టు అయి జైలులో ఉన్న నిందితులు మూల తిరుమలరెడ్డి, లంక శేఖర్‌ను కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ కోర్టు ద్వారా 24 గంటల పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. అనంతరం ఇద్దరి ఇళ్లలో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించినందుకుగాను బాధితుడు కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన కరీంనగర్ రూరల్ పోలీసులు, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అందులో ఇద్దరిని కరీంనగర్ తీగలగుట్టపల్లికి చెందిన మూల తిరుమలరెడ్డి, కరీంనగర్ విద్యారణ్యపురి కాలనీకి చెందిన లంక శేఖర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. ఈ కేసులో మరింత విచారణ చేసేందుకు సీఐ ఏ ప్రదీప్ కుమార్ నిందితులిద్దరి ఇళ్లలో సోదాలు జరిపి కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నారు.



నిందితుల ఇళ్లలో సోదాలకు తీసుకువెళుతున్న సీఐ ఏ ప్రదీప్‌కుమార్

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

కొడిమ్యాల, ఏప్రిల్ 26: మండలంలోని చెప్యాల గ్రామంలో శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామంలోని రజక కులస్తులు, సుమారు 60 మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయం వరకు డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి పూజలు చేసారు. అనంతరం నైవేద్యాలను సమర్పించుకున్నారు. పిల్లా పాపలను చల్లంగా చూడాలని పోచమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. మడలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈదమ్మ, నందీశ్వరుల విగ్ర హాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమాల్లో రజక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సీడ్ ప్లాంట్‌లో పోలీసుల తనిఖీలు

శంకరపట్నం, ఏప్రిల్ 26: శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని కావేరి సీడ్ ప్లాంట్‌లో సీపీ ఆదేశాల మేరకు హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో కేశవపట్నం పోలీసులు, కేంద్ర బలగాలు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కావేరి సీడ్ ప్లాంట్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వలస కార్మికుల ఆధార్‌కార్డులు, ఇతర అడ్రస్ ప్రూఫులను పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో వారు నివాసం ఉండే క్వార్టర్స్‌లో కార్మికులు అసాంఘిక కార్యకలాపాలకు పడుతున్నారా, ఏమైనా మత్తు పదార్థాలు వాడుతున్నారా అనే విషయంపై పూర్తి స్థాయిలో తనిఖీ నిర్వహించారు. అనంతరం సీఐ వెంకట్ సీడ్ ప్లాంట్ నిర్వాహకులతో మాట్లాడారు. వలస కార్మికుల పూర్తి ఆధారలతో కూడి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆముదాలపల్లి ఎక్స్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల విజేత కరీంనగర్ మహిళా జట్టు



చాంపియన్‌గా నిలిచిన మహిళల కరీంనగర్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26: తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ హాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ తెలంగాణ హ్యాండ్ బాల్ ప్రీమియం లీగ్ పోటీల్లో కరీంనగర్ జిల్లా మహిళల జట్టు విజయం సాధించింది. ఈనెల 24, 25, 26 తేదీల్లో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లా మహిళల జట్టు రాష్ట్రంలోని వివిధ జట్లపై విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుందని జిల్లా అండ్ వాల్ అసోసియేషన్ హాయ్ బాధ్యులు జిట్టవేణి శ్రీనివాస్ తెలిపారు .ఈ సందర్భంగా ప్రథమ స్థానం సాధించిన మహిళల జట్టును జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు అంతడుపుల శ్రీనివాస్ ,ఎం.డి యూనిస్ పాషా, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు నందెలి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టుపల్లి అశోక్ ,రాజ్ కుమార్, భాస్కర్ ,వడ్లూరి రాజేందర్, ఐతర వేణి శ్రీనివాస్ , అనుప్ రెడ్డి, వీరుపాల్ రెడ్డి తదితరులు అభినందించారు.

ఆరేళ్ల అనంతరం నిందితుడి అరెస్టు

- కేసు నుంచి తప్పించుకోవడానికి విదేశాలకు

- తిరిగివస్తుండగా ఏయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

మల్యాల, ఏప్రిల్ 26: ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసులో నిందితుడిని ఆరేళ్ల అనంతరం శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో సాజిద్‌ఖాన్, సాయిగణేష్, సాగర్, బావు మహేష్ అనే యువకులపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు అయింది. కేసు నుంచి తప్పించుకోవడానికి మహేష్ విదేశాలకు వెళ్లాడు. మిగితా ముగ్గురు నిందితులను గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మహేష్ ఇండియా వస్తున్నా డనే సమాచారం మేరకు మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఏయిర్‌పోర్టులో అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు.

మే 3న డాక్ అదాలత్

భగత్‌నగర్, ఏప్రిల్ 26: భారతీయ తపాలశాఖ ఆధ్వర్యంలో మే 3వ తేదీన డాక్ అదాలత్ కార్యక్రమం ని ర్వహించనున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరిం టెండెంట్ కె శివాజి ఒకప్రకటనలో తెలిపారు. పోస్టల్ శాఖకు సంబంధించి ప్రజలకు సంబంధించిన సలహాలు సూచనలు, ఫిర్యాదులను రెండవ డాక్ ఆదాలత్‌లో స్వీకరించనున్నట్లు తెలిపారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న వాటిని డాక్ అదాలత్‌లో స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకు ఫిర్యాదులు, సలహాలు సూచ నలు అందించాలన్నారు. కరీంనగర్ డివిజన్ పరిధిలోని జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల పరిధిలోని సమ స్యలను పోస్టల్ ఎన్‌వలప్స్, కవర్స్‌ను కె శివాజి, సూ పరిండెండెంట్, పోస్ట్ ఆఫీస్ కరీంనగర్ డివిజన్, కరీం నగర్-505001 అడ్రస్‌కు 29వ తేదీలోగా చేరుకునే విధం గా పంపించాలన్నారు. మే 3న డాక్ అదాలత్ కరీంనగర్ సూపరింటెండెంట్ కార్యాలయం, కరీంనగర్ డివిజన్ మొదటి అంతస్తులో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవోపేతంగా అవబృధ చక్రస్నానం



కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఇల్లందకుంట, ఏప్రిల్ 26: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, అర్చకులు వంశీధరాచార్యులు, యాజ్ఞికులు శేషం సీతారామాచార్యుల మంత్రోచ్ఛరణాల నడుమ వైభవోపేతంగా అవబృధ చక్రస్నానం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అష్టోత్తరశత (108) కలశాభిషేకం కార్యక్రమం జరిపించారు. స్వామివారి ఉత్సమూర్తులను బాజాభజంత్రీలు, మేళా తాళాలు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ఆవరణలోని కోనేరు వద్దకు తీసుకెళ్లి అవబృద చక్రస్నానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కందుల సుధాకర్, భక్తులు సురేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కన్నుల పండువగా శ్రీపుష్పయాగం

మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా శ్రీపుష్పయాగం (నాఖబలి) ఆలయ ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యులు, యాజ్ఞికులు శేషం సీతారామచార్యులు మంత్రోచ్ఛరణాల నడుమ నిర్వహించారు. రాత్రి 9గంటలకు ద్వాదశా రాధన నిత్యవిధి అనంతరం శ్రీపుష్పయాగం (నాఖబలి) జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పండ్లు, పూలు, శ్రీసీతారామచంద్రస్వామి మూర్తులకు సమర్పించారు. నాఖబలి సందర్భంగా తీరొక్క పూలతో కల్యాణ వేదికను ఘనంగా అలంకరించి వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీపుష్పయాగం జరిపించారు. కార్యక్రమంలో ఈవో సుధాకర్, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా వారికి తీర్థ ప్రసాదాలు అందించారు.



కోనేరులో అవబృధ చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

నియామకం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 26: తెలంగాణ ఫిషర్‌మెన్ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జిగా కాలనీకి చెందిన యాదగిరి తిరుపతిని నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర కమిటీ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ శుక్రవారం తిరుపతికి నియామక పత్రాన్ని అందజేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

ధర్మారం,ఏప్రిల్26: ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామంలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం బొడ్రాయి ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బొడ్రాయి విగ్రహ దాత ఎంపీపీ ముత్యాల కరుణశ్రీబలరాంరెడ్డి గ్రామస్థులతో కలసి బొడ్రాయి ప్రతిష్ఠించే ప్రదేశం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ ప్రజలు పూజలు చేశారు. అనంతరం అన్నదాన చేశారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జిల్లా సహకార సంఘాల ఛైర్మన్ బలరాంరెడ్డి పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని కనుకులలో బొడ్రాయి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. భూలక్ష్మి, మహాలక్ష్మి అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులందరికీ నిత్య అన్నదానం చేశారు. మీస అర్జున్‌రావు, తాజా మాజీ సర్పంచ్ పోలు అంజయ్య, మీస సత్యనారాయణ, మైలారం నారాయణ, గరిగంటి కుమార్ బాబు, శెట్టి రాజయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎంపీపీ బాలాజీరావు పూజలు చేశారు.

బాధితుడికి విద్యార్థుల విరాళం

రామగిరి, ఏప్రిల్ 26: హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న కన్నాల రమేశ్ అనే బాధితునికి కృష్ణావేణి పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థులు విరాళం సేకరించిన రూ.15వేలను శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్లశ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవో 22ను విడుదల చేయాలి

జ్యోతినగర్, ఏప్రిల్ 26 :రాష్ట్రంలోని అసంఘటిత కార్మికుల కనీస ఎతనాలకు సంబంధించిన జీవో 22ను విడుదల చేయాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు. జవో 22ను విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి,నాంసాని శంకర్ కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల కనీస వేతనాల జీవోను విడుదల చేయలేదని, కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మేడేను విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 26: ప్రభుత్వరంగ సంస్థలను పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసిందని రామగుండం ఏరియా మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎడ్ల రవికుమార్ ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖని గంగానగర్‌లోని లారీ యార్డు వద్ద 138వ మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కొమురయ్య, మహిపాల్, సదయ్య, మధుకర్, రాజేందర్, రవి పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

కమాన్‌పూర్, ఏప్రిల్ 26 : కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద జరిగిన అగ్నిప్రమాదంలో గుడిసే దగ్ధమైంది. కమాన్‌పూర్ గ్రామపంచాయతీలోని బాపూజీనగర్ పరిధిలో గల కామెర లక్ష్మయ్యకు చెందిన పూరి గుడిసే శుక్రవారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు తెలుస్తోంది. నిరుపేద అయినా లక్ష్మయ్య ఇంట్లో ఒకేసారి మంటలు లేపడంతో లక్ష్మయ్య అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన సరైన సమయంలో నీరు అందక మంటలు వ్యాపించాయి. అందులో ఉన్న 20వేల నగదుతో పాటు నిత్యావసర వస్తువులు, బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కాగా సంఘటన స్థలానికి తహసీల్దార్ అరిపోద్దీన్ చేరుకొని పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి ఫైర్‌స్టేషన్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు.

బీఆర్ఎస్ పాలనలో ఒరిగిందేమీ లేదు..

ఎలిగేడు, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్, నారాయణపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం నారాయణపల్లిలో ఏర్పాటుచేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రేజేశ్వర్‌రెడ్డి, చిలుక సతీష్, దుగ్యాల సంతోష్‌రావు, దన్నాయక్ దామోదర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, గోదెల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి...

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 26: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వ శ్రీరాంపూర్ మోట్లపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎం శ్రీకాంత్, డీటీసీఎస్ శంకర్, తాసిల్దార్ జాహెద్ పాషా, ఆర్ఐ ఉదయశ్రీ, ఏపీఎం కనకయ్య, సీఈఓ కొల్లేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 26: వేసవి కాలంలో సింగరేణి ఆధ్వర్యంలో ఉద్యోగుల పిల్లలు, పరిసర ప్రాంత చిన్నారులకు నిర్వహించే ఉచిత క్రీడ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను ఈనెల 29వ తేదీ నుండి 25రోజుల పాటు స్థానిక అబ్దుల్ కలాం స్టేడియంలో వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జీఎం తెలిపారు. శిక్షణ పట్ల ఆసక్తి ఉన్న 18ఏళ్ళలోపు చిన్నారులు, సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఆర్జీ-2 జీఎం ఆఫీస్ పర్సనల్ విభాగంలో పేర్లు నమోదు చేసుకోవాలని జీఎం సూర్యనారాయణ సూచించారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 26: ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్జీ-2 సివిల్ విభాగంలో మేడే పోస్టర్‌ను ఇఫ్టూ జిల్లా ప్రధానకార్యదర్శి బీ అశోక్ ఆవిష్కరించారు. మేడే వేడుల్లో కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని అశోక్ పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం గత పదేళ్ళలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేసినట్లు అశోక్ పేర్కొన్నారు. కార్మిక చట్టాలను మార్చే కుట్ర చేసినట్టు తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలన అనుసరిస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వాకి వ్యతిరేకంగా ఉద్యమం చాల్సిన అవసరం ఉన్నదని అశోక్ తెలిపారు. ఈకార్యక్రమంలో లింగయ్య, రాజేశ్వరి, కొంరమ్మ, ప్రకాష్, స్వామి, నాగరాజు పాల్గొన్నారు.

లాభాల బాటలో సహకార సంఘాలు

జిల్లా సహకార అధికారి శ్రీమాల

సుల్తానాబాద్, ఏప్రిల్ 26: పెద్దపల్లి జిల్లాలోని ఇరవై సహకార సంఘాలు రైతులకు రుణాలు ఇతర సేవలను అందిస్తూ లాభాల బాటలో పయనిస్తున్నాయని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకలువల సహకార సంఘం ఆధ్వర్యంలో దేవునిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐటీసీ పెట్రోల్ బంకు రీటైల్ ఔట్‌లెట్‌ను డీసీవో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ జిల్లాలోని సహకార సంఘాలు రైతులకు రుణాలు,ఎరువులు, విత్తనాలు వంటివి పంపిణీ చేస్తూ మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తూ, రైతులకు వారి కుటుంబ సభ్యుల అవసరాలను తీర్చడంలో సూపర్‌బజార్‌లు, వాటర్ ప్లాంట్‌లను, పెట్రోల్‌బంకులను, గోదాములను నిర్వహిస్తున్నాయని వివరించారు. సొసైటీలు వ్యవసాయ ఆధారితమైన సేవలను కాకుండా వాణిజ్యపరమైన అన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. సుల్తానాబాద్, చిన్నకలువల సొసైటీలు నిర్వహిస్తున్న సేవలను చెపుతు వాటిని ఆదర్శంగా తీసుకోవాలని సంఘ పాలకవర్గం సీఈఓలు ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ విజయవంతంగా సొసైటీలను నడపాలన్నారు.

● 34 పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలు..

- కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాల ఆధ్వర్యంలో 34 పెట్రోల్ బంకులను నిర్వహిస్తున్నామని కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణరావు తెలిపారు. ఈ పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజన్సీలు సొసైటీలు నిర్వహిస్తున్నాయని నిర్వహణఖు సంఘాలకు నాలుగు శాతం మేరకు రుణాలు అందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని సంఘాలలో అనేక సేవలను పెంపొందిస్తూ వాటిని బహులార్థ సంఘాలుగా ప్రభుత్వపరంగా తీర్చిదిద్దుతామని సొసైటీలను ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించేలా కృషిచేస్తూ తమ సహకారం అందిస్తామన్నారు. ప్యాక్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బంకులకు వాటి నిర్వహణ పెట్టుబడి కింద రూ.9.50 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సుల్తానాబాద్, పెద్దపల్లి బ్యాంకు మేనేజర్లు శశిధర్ రావు, హన్మంతరావు, ఐటీసీ ప్రతినిధులు ఆకాశ్, నితీష్, సీఈవోలు వల్లంకొండ రమేష్, బూరుగు సతీష్ తదితరలు పాల్గొన్నారు. కాగా డీసీవో తదితరులను సంఘ సీఈవో రమేష్ ఘనంగా సన్మానించారు.



దేవునిపల్లిలో పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న శ్రీమాల

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి : కొప్పుల

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 26: తెలంగాణలో అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శాంతినగర్, కునారం రోడ్డు సుభాష్‌నగర్, జెండా చౌరస్తా, పారస్ మజీద్, అమర్‌నగర్‌లలో కార్నర్ మీటింగ్ పాల్గొని ఓట్లను అభ్యర్థించిన అనంతరం ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేసే వరకు వెంటపడుతామన్నారు. రుణ మాఫీ చేయకుండా, రైతు బంధు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సాగునీరందక పంటపొలాలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత మాకే దక్కిందన్నారు. మిషన్ భగిరథ ద్వారా ఇంటింటికి తాగునీరందించామన్నారు. ఆసరా పింఛన్లు అందజేసి ఆదుకున్నామని, ఆడపిల్ల పెళ్ళిల్లకు లక్ష రూపాయలు అందజేశామని ఇలా చెప్పుకుంటూ పోతే రోజంతా చాలదని ఆయన పేర్కొన్నారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను తరిమి కొట్టాలని, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చెప్పే కళ్ళిబొల్లి మాటలను నమ్మవద్దని, మన ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేసిన కొప్పులను గెలిపించాలని కోరారు. ఉప్పు రాజ్‌కుమార్, హన్మంతు, తదితరులున్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



జూలపల్లిలో తాగునీటి బావిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్, అధికారులు

జూలపల్లి, ఏప్రిల్ 26:వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి వేనుగోపాల్ సంబంధజత మండల గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. జూలపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పారిశుధ్య నిర్వాహన, నర్సరీ, తాగునీటి వనరులను, బావులను ఆయన పరిశీలించారు. రాబోయే రోజుల్లో మరింతగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో కిరన్, పంచాయతీ కార్యదర్శి అనంతుల లచ్చయ్యలు ఉన్నారు.

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 26: ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి కలుగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఎంపీవో సుదర్శన్ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని హనుమంతునిపేట, గుర్రంపల్లి, మారేడుగొండ తదితర గ్రామాలలో పర్యటించి తాగునీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. ప్రతీరోజు ప్రజలకు తాగునీరు అందుతున్న విదానాన్ని అయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వేసవి లో ఎండల తీవ్రతకు చెరువులు కుంటలు, బావుల్లో, ఇతర నీటి వనరుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్న సందర్భంగా గ్రామాలలని తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఆర్ డబ్ల్యూఎస్ డీఈ సతీష్ ఉన్నారు.

న్యాయమూర్తుల బదిలీలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 26: జిల్లాలో పనిచేస్తున్న పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 21 మందిని రాష్ట్ర వ్యాప్తంగా బదిలీచేయగా వీరిలో గోదావరిఖనిలో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు రంగారెడ్డి ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎన్ మంజులను నియమించారు. గోదావరిఖనిలోని 1వ అదనపు న్యాయమూర్తిగా ఆర్ స్వారికను నియమించారు. ఇక్కడ ఉన్న దుర్గం గణేష్‌ను సుల్తానాబాద్ మున్సిఫ్ మేజిస్ట్రేట్‌గా బదిలీచేయగా, సుల్తానాబాద్ జడ్జి జీఎస్ఎల్ ప్రియాంకను కూకట్‌పల్లికి బదిలీ చేసారు.

జప్తు చేసిన నగదులో కొంత విడుదల

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 26 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాలు తనిఖీలు చేసి పట్టుకున్న నగదులో కొంత విడుదలైనట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీలలో మొత్తం 19లక్షల 78వేల 130 రూపాయల్లో, 7లక్షల 45 వేల ఐదు వందల రూపాయలు విడుదల చేసినట్లు వివరించారు. సరైన ఆధారాలు సమర్పించనందున 12 లక్షల 32 వేల 680 రూపాయల నగదు విడుదల చేయలేదని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామని, సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు పదిహేడు, 1950టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఇప్పటి వరకు 86 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించామని తెలిపారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 26: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో శివ పంచాయతన నవగ్రహ సహిత శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, చేతి ధర్మయ్య, అల్లం దేవేందర్, బంగారు రమేష్, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జిల్లాల ఐలయ్య, ఉపాధ్యక్షులు కొండపర్తి రవీందర్, అల్లంల రాజు, జిన్నా రామచంద్రంరెడ్డి, మర్రి సంగీత మహేందర్, వడ్లూరి సాగర్, జిలుక ఎల్లేష్ ఉన్నారు.

ఈశ్వర్ ఆరోపణలు అర్థరహితం

ఓదెల, ఏప్రిల్ 26: మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ చేసిన ఆరోపణలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ప్రేంసాగర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రేంసాగర్‌రెడ్డి మాట్లాడుతూ దొంగలే దొంగ అన్నట్లు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ లేకుముందే గడ్డం వెంకటస్వామి ఎంపీ వివేక్ ప్రజా సేవల్లో నిమగ్నమయ్యారని వారు చేసిన సేవలకు తులతూగాడన్నారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో ఛైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి భైరి రవిగౌడ్, మాజీ ఎంపీటీసీ బోడగుండు శంకర్, మాజీ సర్పంచ్ అంకం రమేష్, మాజీ ఎంపీటీసీ నీర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

- చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్‌వెంకటస్వామి

ధర్మారం, ఏప్రిల్ 26: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ జి, వివేక్‌వెంకటస్వామి కార్యకర్తలకు పిలుపునిచ్చారు, శుక్రవారం ధర్మారంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్ విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. వచ్చే నెల మొదటి వారంలో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార రోడ్‌షో బహిరంగ సభలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎంపీగా వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కాడె సూర్యానారాయణ, దేవి జనార్ధన్ రూప్లానాయక్, దేవి లావణ్య తదితరులు ఉన్నారు.

పెద్దపల్లిటౌన్ : పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ గెలుపు కోసం కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇంచార్జీ జిల్లా ఆనంద్ కోరారు. జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అభిలాష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ఆనంద్ హాజరై మాట్లాడారు. విద్యార్థుల పక్షాన ఎల్లప్పుడూ ఎన్ఎస్‌యూఐ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి భరత్ కుమార్, పెనుకొండ ప్రణయ్, ఈగ ప్రశాంత్ జిల్లా ప్రధాన కార్యదర్శులు యమ అనిల్ కుమార్, సాయికుమార్ జిల్లా సెక్రెటరీ మదాసి శ్రవణ్‌రాజ్, పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కోదాది ప్రశాంత్‌రాజ్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో చీఫ్ క్లస్టర్లు, జోనల్ క్లస్టర్లు, డివిజన్ అధ్యక్షులు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. వంశీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, నాయకులు కాల్వ లింగస్వామి, పాతిపెల్లి రవి, పెద్దెల్లి ప్రకాష్, మారెల్లి రాజిరెడ్డి, చుక్కల శ్రీనివాస్, తిప్పారపు శ్రీనివాస్, కౌటం సతీష్, కొప్పుల శంకర్, దూళికట్ట సతీష్, గట్ల రమేష్, దాసరి సాంబమూర్తి పాల్గొన్నారు.



ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జూలపల్లి, ఏప్రిల్ 26. కొద్దిరోజుల్లో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొని అర్హులైన ప్రతిఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మండల డిప్యూటీ తహసీల్దార్ ఎండి అబుబాకర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామస్థులతో కలిసి ఓటరుపై అవగాహన ర్యాలి నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యత దాని ఆవశ్యకతపై డిప్యూటీ తహసీల్దార్ అబుబాకర్ ప్రజలకు వివరించారు. అనంతరం ఓటు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు సదయ్య, శ్రవంతి, పంచాయతి కార్యదర్శి లచ్చయ్య, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశావర్కర్లు పలువురు పాల్గొన్నారు.

14మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు తిరస్కరణ

పెద్దపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గానికి దాఖలైన నామినేషన్లలో 14 మంది అభ్యర్థుల 24నామినేషన్ పత్రాలను తిరస్కరించారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నామినేషన్లు దాఖలు చేసిన వారి సమక్షంలో పత్రాలను పరిశీలించారు. ఏప్రిల్ 18నుంచి ఏప్రిల్ 25వరకు నామినేషన్లు స్వీకరించారు. ఈ సందర్భంగా 63మంది అభ్యర్థులు 109 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. వాటిని నామినేషన్లు సమర్పించిన అభ్యర్థుల సమక్షంలో పరిశీలించారు. 63మంది అభ్యర్థులు 109 నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఇందులో 14మంది అభ్యర్థులకు సంబంధించిన 24నామినేషన్ పత్రాలు నిబంధనల ప్రకారం లేనందున వాటిని ఎన్నికల అధికారి తిరస్కరించారు. భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అన్ని వివరాలు పూర్తిగా సమర్పించిన 49 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఆమోదించామని పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ ప్రకటించారు. ప్రధాన పార్టీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్లు నిబంధనల ప్రకారం సక్రమంగా ఉన్నందున ఆమోదించారు.



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



రామకృష్ణ

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 26: రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తెలుగు విభాగం అధ్యాపకుడు నామాల రామకృష్ణకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. వరంగల్ జిల్లా పద్మకవులలో అల్లూరి రాజేశ్వర కవి జీవితం, సాహిత్యం-ప్రత్యేక అధ్యయనంపై ప్రొఫెసర్ కొంక యాదగిరి పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. అందుకు గాను కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎస్ నర్సింహాచారి రామకృష్ణకు డాక్టరేట్‌ను ప్రకటించారు. కాగా రామకృష్ణ హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు మండలం పెంచికలపేట్ గ్రామానికి చెందిన రామకృష్ణ రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. కాగా రామకృష్ణకు డాక్టరేట్ రావడంపై కళాశాల ప్రిన్సిపల్ మదార్‌గౌడ్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జి సేవలు అభినందనీయం



జడ్జీని సన్మానిస్తున్న న్యాయవాదులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 26: పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా అర్జున్ సేవలు అభినందనీయమని పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్ అన్నారు. పెద్దపల్లిలో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన అర్జున్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా సత్కరించారు. పదవీకాలంలో న్యాయమూర్తిగా అర్జున్ గొప్పగా పనిచేశారని, రాజ్యాంగ పరిరక్షణలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమాదేవి, బాబ్జీ, వాసు, బర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆటో జేఏసీ వినతిపత్రం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 26: ఆటో యూనియన్ రాష్ట్ర జేఏసీ కమిటీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు ఆటో డ్రైవర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎనిమిదివేల రూపాయల ఇన్సూరెన్స్‌ను వెయ్యి రూపాయలకు తగ్గించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబానికి 25 లక్షల రూపాయలు నష్టపరిహారం అందజేయాలన్నారు. ప్రభుత్వం సంవత్సరానికి ఇచ్చే 12 వేల రూపాయలను నెలకు 12 వేల రూపాయలు ఇవ్వాల్సిందిగా వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి దార మధు, మాతంగి శివరాజ్, కాంపెల్లి శ్రీనివాస్, కాజీపేట రాజయ్య, మట్ట నరసయ్య, అంబాల శంకర్, అల్లంకి శంకర్, సదానందం, శ్రీనివాస్, ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

పుట్ట మధు వ్యాఖ్యలు హాస్యాస్పదం

రామగిరి. ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పుట్ట మధు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయాక పుట్ట మధుకు ప్రజలపై మమకారం పెరిగిపోతోందన్నారు. ఇసుక, ఉపాధిహామీ కూలీల విషయంలో పుట్ట మధు మాట్లాడుతున్న మాటలు దొంగేదొంగ అనే చందంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీటీసీ చిందం మహేష్, నాయకులు ముస్త్యాల శ్రీనివాస్, మోతుక్కారి అవినాష్, బుద్దార్తి శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

జ్యోతినగర్, ఏప్రిల్ 26: మేడే దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఐఎఫ్‌టీయూ నాయకులు శుక్రవారం విడుదల చేశారు. కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడతున్నదన్నారు. గత పదేళ్లలో దేశంలో అనేక ప్రభుత్వ పరిశ్రమలు మూతపడ్డాయని, పలు కంపెనీలు ప్రైవేటు పరమయ్యాయన్నారు. బడా వ్యాపారులకు ప్రయోజనం కలిగించే విధంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని విమర్శించారు. కార్మికుల చట్టాలను సవరించాలని, కొత్తగా తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లతో కార్మికులు, యూనియన్లకు తీరని నష్టం జరుగుతుందని అన్నారు. కార్మికులు సమ్మె చేసే హక్కుతోపాటు పలు హక్కులను కోల్పోక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, రాయమల్లు, సుధాకర్, కుమార్, రవిందర్, వెంకటస్వామి, వసంత్, రమేష్, మహేందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో.. ఎండిపోయిన ఔషధ మొక్కలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎండిపోయిన ఔషధ మొక్కలు

జూలపల్లి, ఏప్రిల్ 26: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని ఆవరణలో ఏర్పాటుచేసిన ఔషధ మొక్కలు, నీల్లులేక ఎండిపోతున్నాయని మండల ప్రజలు సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో భాగంగా అవసరమైన నిధులను వెచ్చించి ఔషధాల మొక్కలను ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రం ఆవరణలో అధికారులు ఏర్పాటు చేశారు. ప్రజలకు, రోగులకు ఆరోగ్యపరంగా వారికి ఎంతో అవసరమైన మొక్కలుగా గుర్తించినా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో ఆసుపత్రి వైద్యులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నీరుగార్చుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆర్థిక సహాయం

రామగిరి, ఏప్రిల్ 26: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన పేద కుటుంబాలైన కందిసారయ్య-నాగమణ(కూతురు) నవవధువు హర్షిత, ఇరుగురాళ్ల రాజేశ్వర్-శంకర్ (కూతురు) నవవధువు లక్ష్మి వివాహాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 5,500 నగదుతో పాటు పట్టుచీరలను శుక్ర వారం అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోల్యా మూరి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో శరణ్య, దొడ్లశ్రీనివాస్, దొంతుల సురేష్, కంది రమేశ్, దొడ్డిపాటి సారయ్య, ఇరుగురాల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.